సాక్షి
రంగారెడ్డి

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



విద్యార్థుల పాలిట శాపం డ్రగ్స్

డ్రగ్స్ ఉచ్చులో చిక్కితే జీవితం అంధకారం అవుతుందని ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. 8లో▸



అవగాహన అవసరం

న్యాయపరమైన చట్టాల గురించి రైతులు అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల సీనియర్ సివిల్‌కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. 8లో▸

ఎస్‌బీఐ వెల్త్ హబ్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం వేదికగా వెల్త్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ వెల్త్ హబ్‌ను సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలో 12వ వెల్త్ హబ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

న్యూస్‌రీల్

మహేందర్‌రెడ్డి ఇంటిపై ఏసీబీ దాడులతో కలకలం

కందుకూరు: నల్లగొండ జిల్లా మర్రిగూడ తహసీల్దార్ మహేందర్‌రెడ్డి ఇంటిపై ఏసీబీ అధికారుల దాడితో కందుకూరు మండలంలో కలకలం చెలరేగింది. మహేందర్‌రెడ్డి కందుకూరు తహసీల్దార్‌గా పది నెలలకు పైగా విధులు నిర్వర్తించారు. ఆగస్టు ప్రారంభంలో ఆయన్ని అక్కడికి బదిలీ చేశారు. పలు న్యూస్ చానళ్లలో కందుకూరు తహసీల్దార్‌పై ఏసీబీ దాడులు అని ప్రచారం కావడంతో అందరూ వాకబు చేయడం ప్రారంభించారు. తర్వాత ఆయన ఇక్కడి నుంచి బదిలీ అయి రెండు నెలలు గడుస్తుందని తెలియడంతో, ఆయన ఇక్కడ ఎవరి వద్దనైనా లంచాలు తీసుకున్నారా అని చర్చించుకోవడం కనిపించింది. మరోవైపు తహసీల్దార్ కార్యాలయం అధికారులకు తెలిసిన వారు ఫోన్ చేసి మహేందర్‌రెడ్డి గురించి వాకబు చేసినట్లు సమాచారం.

పోలీస్ సిబ్బందికి కంటి పరీక్షలు



యాచారం: పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బందికి శనివారం కంటి పరీక్షలు నిర్వహించారు. నగరంలోని మాక్స్ విజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో యాచారం పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి కంటి పరీక్షలు చేశారు. సీఐ సైదయ్యతో పాటు ఎస్‌ఐ వెంకటనారాయణ, ఇతర పోలీస్ సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన సిబ్బందికి శస్త్రచికిత్సలతో పాటు, అద్దాలు అందజేయనున్నట్టు ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది.

పంటల నమోదు పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

కేశంపేట: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. వ్యవసాయ అధికారులు గతంలో క్షేత్రస్థాయిలో నమోదు చేసిన పంటల నమోదును శనివారం ఆమె పరిశీలించారు. అందులో భాగంగా కేశంపేటలో పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పంటల నమోదు సక్రమంగా నిర్వహిస్తే విక్రయాల సమయంలో ఎలాంటి సమస్యలు రావని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నిమజ్జనంలో అపశ్రుతి



రమేష్ (ఫైల్)

కేశంపేట: వినాయక నిమజ్జనంలో ఆటపాటలతో గ్రామస్తులతో కలిసి ఉల్లాసంగా గడిపిన యువకుడు అంతలోనే చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దత్తాయపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొర్ర రమేష్ (22) వ్యవసాయం చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి వినాయక నిమజ్జనం చేస్తుండగా గ్రామానికే చెందిన సుధాకర్‌తో కలిసి చెరువు వద్దకు వెళ్లాడు. గ్రామస్తులు నిమజ్జనం చేసి వస్తుండగా రమేష్, సుధాకర్ చెరువులో దిగారు. సుధాకర్ మునిగిపోతుండగా గ్రామస్తులు బయటికి తీశారు. అప్పటికే నీటిలో మునిగి రమేష్ మృతి చెందాడు. మృతుడి అన్న నవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్‌ఐ బీఎస్‌ఎస్ వరప్రసాద్ తెలిపారు.

ఐసీఏఆర్‌లో శ్రీజారెడ్డికి ఆలిండియా నాలుగో ర్యాంక్



షాద్‌నగర్ రూరల్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ విభాగంలో పట్టణంలోని విజయనగర్ కాలనీకి చెందిన గొంగళ్ల అంజిరెడ్డి ఉమాదేవి దంపతుల కుమార్తె శ్రీజారెడ్డి ఆల్‌ఇండియా నాలుగో ర్యాంకు సాధించింది. శనివారం వెలువడిన ఫలితాలలో ఆల్ ఇండియా స్థాయిలో నాలుగో ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో మొదటి ర్యాంకు సాధించింది. ప్రాథమిక దశనుంచే చదువులో అత్యంత ప్రతిభ కనబరుస్తూ వచ్చిన ఆమె.. వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎదగాలనే సంకల్పంతో పీహెచ్‌డీ అర్హత పరీక్షల్లో మెరుగైన ర్యాంకు సంపాదించింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శ్రీజారెడ్డిని అభినందించారు.

ధిక్కార స్వరం!



- ఎన్నికల వేళ.. అసంతృప్తి జ్వాల
- అన్ని పార్టీల్లోనూ సెగలు మొదలు
- ఆశావహుల తిరుగుబావుటా
- దుమారం రేపుతున్న వ్యాఖ్యలు
- అధిష్టానాలకు తప్పని తలనొప్పులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మరో వారం, పది రోజుల్లో ఎన్నికలకు నగరా మోగనుంది. అధికారపార్టీ ఇప్పటికే అభ్యర్థిత్వాలను ఖరారు చేసి ప్రచారపర్వంలోకి అడుగిడగా.. టికెట్లు దక్కని అసంతృప్త నేతలను బుజ్జగించే పర్వం సైతం అదేస్థాయిలో చేస్తోంది. ఇక విపక్ష కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాను కొలిక్కి తెచ్చి.. ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ కోసం ఎదురు చూస్తోంది. భారతీయ జనతాపార్టీ దరఖాస్తులను ఆహ్వానించి.. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను అంతర్గతంగా వడపోస్తోంది. టికెట్ల కేటాయింపు ఆయా పార్టీలకు పెద్ద తలనొప్పిగా మారింది. మునుపెన్నడూలేని రీతిలో టికెట్ల కోసం పోటీ పెరగడం.. అర్థ, అంగబలం ఉండడంతో టికెట్లు దక్కని ఆశావహులను ఎలా బుజ్జగించాలనే అంశంపై అధిష్టానాలు తలపట్టుకుంటున్నాయి.

కాంగ్రెస్‌లో 'కొత్త' కలకలం



మహేశ్వరం కాంగ్రెస్ టికెట్ కేటాయింపు అంశం ఆ పార్టీలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. అభ్యర్థి పేరు ఇప్పటి వరకు అధికారికంగా వెల్లడించకపోయినా.. ఎవరికి వారు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. టికెట్ల కేటాయింపులో డబ్బు కీలకంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాక్షాత్తు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిపైనే ఆరోపణలు రావడం విశేషం. ఇప్పటికే ఎమ్మెల్యే టికెట్ వచ్చిందని చెప్పుకొంటున్న ఓ అభ్యర్థి నుంచి రూ.10 కోట్లు, ఐదెకరాల భూమి రేవంత్ తీసుకున్నట్లు ప్రచారం జరగడం.. ఇదే అంశంపై కొత్త మనోహర్‌రెడ్డి తన అసంతృప్తిని వెల్లగక్కడం.. ఆ మరుక్షణమే ఆయనపై పార్టీ వేటు వేయడం.. భాగ్యలక్ష్మి అమ్మ వారిపై ప్రమాణం చేసి నిజాయితీ నిరూపించుకోవాల్సిందిగా ఆయన రేవంత్‌కు సవాల్ విసరడం చర్చనీయాంశమైంది.

బీజేపీలో 'కొండా' దుమారం



బీఆర్‌ఎస్‌ను వీడి..బీజేపీలో చేరిన చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు పార్టీని ఇరకాటంలోకి నెట్టాయి. ఈ అంశంపై పార్టీ పెద్దలు ఆయనపై గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. పార్టీ అంతర్గత అంశాలు.. ఆయన మీడియా ముఖంగా మాట్లాడటం ఇది రెండోసారి. కవితను అరెస్టు చేయకపోవడంతో బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటేననే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లాయని, ప్రజల్లో బీజేపీపై నమ్మకం సన్నగిల్లిందని, తెలంగాణలో అధికారంలోకి రావడం కష్టమేనని ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీ పెద్దలకు ఆగ్రహం తెప్పించినట్టు సమాచారం. అప్పటి వరకు.. ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, కల్వకుర్తి, శేరిలింగంపల్లి నియోజక వర్గాల్లో బీఆర్‌ఎస్‌కు దీటుగా కనిపించిన బీజేపీ గ్రాఫ్.. అటు జాతీయ స్థాయిలో, ఇటు రాష్ట్ర స్థాయిలో తాజాగా చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, కొంతమంది నేతల వ్యవహారశైలితో మరింత దిగజారినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక్కడ టికెట్లు దక్కని ఆశావహులు ఇతర పార్టీల్లోకి వెళ్లే అవకాశం లేకపోలేదు. ఎన్నికల గడువు సమీపిస్తున్నప్పటికీ నియోజక వర్గాల వారీగా అభ్యర్థుల పేర్లను ప్రకటించకపోవడం.. ఎన్నికల్లో పార్టీ వ్యూహం ఏమిటో అర్థం కాని పరిస్థితి తలెత్తడంతో కేడర్ అయోమయానికి గురవుతోంది.

బీఆర్‌ఎస్‌లో 'కసిరెడ్డి' కలవరం



అధికార బీఆర్‌ఎస్‌లోనూ అసంతృప్తి జ్వాల ఇప్పటికీ రగులుతూనే ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ టికెట్లు ఇవ్వనున్నట్లు అధిష్టానం ప్రకటించిన నేపథ్యంలో అధిష్టానం నిర్ణయంపై ఆశావహులు తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. చేవెళ్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు మళ్లీ టికెట్ ఇవ్వడంపై మాజీ ఎమెల్యే రత్నం మండిపడ్డారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఎల్బీనగర్‌లో సీనియర్ నేత ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ తిరుగుబావుటా ఎగరేశారు. ఈసారి ఎన్నికల్లో ఆయన భార్య లక్ష్మి పోటీకి దిగుతున్నట్లు ప్రకటించారు. ఇబ్రహీంపట్నంలో సీనియర్ నేత క్యామ మల్లేశం కినుక వహించారు. ఆయన కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. ఇక కల్వకుర్తిలో సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పావులు కదిపారు. ఈ క్రమంలో ఆయనపై అనేక ఆరోపణలు కూడా చేశారు. చివరికి మంత్రి కేటీఆర్ జోక్యం చేసుకుని నచ్చజెప్పినా.. ఆయన వినలేదు. తన అనుచరులతో కలిసి పార్టీని వీడేందుకే సిద్ధమయ్యారు. రెండు మూడు రోజుల్లో ఆయన కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

ఆయిల్‌పాం సాగు పెంచడమే లక్ష్యం

- రాష్ట్ర ఉద్యాన శాఖ ఆయిల్‌పాం కన్సల్టెంట్ నర్సింహారావు

మొయినాబాద్: ఆయిల్‌పాం సాగు పెంచడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర ఉద్యన శాఖ ఆయిల్‌పాం కన్సల్టెంట్ డాక్టర్ బి.నర్సింహారావు అన్నారు. ఉద్యాన శాఖ, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మొయినాబాద్ రైతు వేదికలో ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 5,500 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఎకరాకు 57 మొక్కలు నాటుకోవచ్చని.. అందుకోసం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. మొక్కలు నాటిన 3–4 సంవత్సరాల మధ్య మొదలై 25–30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందన్నారు. దిగుబడిని ఆయిల్‌పాం కంపెనీ కొనుగోలు చేస్తుందని చెప్పారు. మొదట్లో అంతర పంటలు సాగుచేసుకోవచ్చని.. దీంతో అధిక లాభాలు పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ ఆయిల్‌పాం టెక్నికల్ అసిస్టెంట్ సోమిరెడ్డి, చేవెళ్ల ఏడీఏ రమాదేవి, జిల్లా ఏడీహెచ్ సంజయ్‌కుమార్, ఆయిల్‌పాం కంపెనీ ఎండీ రఘు, డైరెక్టర్ రామకృష్ణ, హెచ్‌ఓ అశోక్, మొయినాబాద్ ఏఓ రాగమ్మ, ఏఓలు, ఏఈఓలు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

నందిగామ: ఆయిల్‌పాం సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించవచ్చని రాష్ట్ర ఆయిల్‌పాం కన్సల్టెంట్ డాక్టర్ బి.నర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం వ్యవసాయ శాఖ, ఉద్యనవన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రాయితీలను అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు రాజా రత్నం, సంజయ్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ సోమిరెడ్డి, అధికారులు రఘు, రామకృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి ఉషారాణి, ఏఈఓలు వరలక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- అట్టహాసంగా ప్రారంభమైన వాలీబాల్ పోటీలు

కడ్తాల్: విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలపై దృష్టి సారించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 67వ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతి పల్లెలో ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించి, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాడానికి క్రీడా పోటీలు దోహదపడుతాయన్నారు. పోటీల్లో కడ్తాల్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, షాద్‌నగర్, శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం జోన్లకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–17 బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో ఇబ్రహీంపట్నం, ద్వితీయ స్థానంలో మహేశ్వరం.. అండర్–14 విభాగంలో కడ్తాల్ ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో షాద్‌నగర్ నిలిచాయి. బాలికల అండర్–17 విభాగంలో ప్రథమ స్థానంలో ఇబ్రహీంపట్నం, ద్వితీయ స్థానంలో మహేశ్వరం.. అండర్–14 బాలికల విభాగంలో కడ్తాల్ ప్రథమ, మహేశ్వరం ద్వితీయ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు అధికారులు, ప్రజాప్రతినిధులు షీల్డ్‌లతో పాటు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ క్రీడా కార్యదర్శి బీముడునాయక్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, అనురాధ, తహసీల్దార్ షేక్ ముంతాజ్ సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, ఎంఈఓ సర్దార్‌నాయక్, నోడల్ అధికారి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనకు కాలం చెల్లింది



పాలమూరు ప్రజాగర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాపారావు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కేసీఆర్ కొనసాగిస్తున్న దుర్మార్గపు పాలనకు కాలం చెల్లిందని, రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాపారావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను తామే అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం బోగస్ ప్రచారం చేసుకుంటోందని అన్నారు. బోగస్ పాలన కొనసాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బొందపెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలుచెప్పి ప్రజలను మోసంచేస్తూ అధికారాన్ని అనుభవిస్తున్న కేసీఆర్ మాటలు ఇకనుంచి సాగవన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెందారని అన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని, రైతాంగానికి సాగునీరందిస్తామని చెప్పిన నాయకులు రీడిజైన్ పేరుతో ప్రాణహిత ప్రాణం తీశారని విమర్శించారు. పాలమూరు ప్రజా గర్జనకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవుతున్నారని, ఈ పర్యటనలో ప్రధాని ప్రగతి పనులను ప్రారంభించనున్నారని తెలిపారు. ప్రధాని పర్యటనతో రాష్ట్ర ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఇప్పటికే రూ.9.5 లక్షల కోట్లు ఇచ్చిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అడ్డుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గద్దె దించి బీజేపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పాలమూరు ప్రజాగర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, అందె బాబయ్య, కక్కునూరి వెంకటేశ్ గుప్తా, కమ్మరి భూపాలాచారి, దేపల్లి అశోక్‌గౌడ్, పాతపల్లి కృష్ణారెడ్డి, రుషికేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట

- మంత్రులు సత్యవతి రాథోడ్, సబితారెడ్డి



మహేశ్వరం: ఉప్పుగడ్డ తండాలో గిరిజన గురుకుల పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రులు సత్యవతి రాథోడ్, సబితారెడ్డి, చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

మహేశ్వరం: తెలంగాణ ప్రభుత్వం గిరిజన, ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేసిందని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మండల కేంద్రం, ఉప్పుగడ్డ తండా, మన్సాన్‌పల్లి గ్రామాల్లో రూ.14.17 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన బంజారుల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. అన్ని కులాల అభివృద్దే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 1,008 గురుకుల పాఠశాలల్లో 7లక్షల మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. గత పాలకులు గిరిజనులను ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా 24 కుల సంఘాలకు స్థలాలు కేటాయించి ఆత్మ గౌరవ భవనాలు నిర్మిస్తున్న ఘనత సబితమ్మకే దక్కుతుందన్నారు.

ముఖ్యమంత్రి స్ఫూర్తితో..

సీఎం కేసీఆర్ స్ఫూర్తితో నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో అన్ని కుల సంఘాలకు స్థలాలు కేటాయించి ఆత్మ గౌరవ భవనాల నిర్మాణం చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. గ్రామాల్లో పేద ప్రజలకు డబుల్ బెడ్రూంలు కేటాయిస్తున్నామని, మరికొంత మందికి 75 గజాల స్థలం ఇస్తున్నామని తెలిపారు. ఖాళీ జాగా ఉండి ఇల్లు నిర్మించుకునేవారికి గృహలక్ష్మి కింద రూ.3 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునితా నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీతారాంపూర్‌కు ప్రత్యేక గుర్తింపు

చేవెళ్ల: సీతారాంపూర్‌లో వస్తున్న పెద్ద పెద్ద కంపెనీలతో ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందనుందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వీరయ్యగార్డెన్‌లో శనివారం షాబాద్ మండలం సీతారాంపూర్‌లో పారిశ్రామిక వాడకోసం భూములు అందించిన రైతులకు ఎకరానికి గుంట చొప్పున ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమెల్యే కాలె యాదయ్య, ఆర్డీఓ సాయిరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు, ఈ ప్రాంతంలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని చెప్పారు. అంతకు ముందు చేవెళ్ల మండలం ముడిమ్యాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతి, ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్ చిన్నప్పలనాయకుడు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని శనివారం సర్పంచ్ మంజులతో కలిసి ప్రారంభించారు. గ్రామ సమీపంలో పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీపీ నక్షత్రంజేవంతు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మమత, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శివగంగకు రా.. ప్రమాణం చేద్దాం

'కొత్త'కు మేయర్ పారిజాత సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న పారిజాత

బడంగ్‌పేట్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో పాటు తనపై కొత్త మనోహర్‌రెడ్డి నిరాధారమైన నిందారోపణలు చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత అన్నారు. మల్లాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనవద్ద సాక్ష్యాలున్నాయని చెబుతున్న ఆయన దమ్ముంటే ఆదివారం ఉదయం 9.30 గంటలకు మహేశ్వరం శివ గంగ అలయానికి రావాలని సవాల్ విసిరారు. తాను రేవంత్‌రెడ్డితో టికెట్ కొనుగోలు కోసం ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని ప్రమాణం చేస్తానని అన్నారు. నియోజకవర్గం నుంచి ఎవరికి టికెట్ ఇచ్చినా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్‌ఎస్ కొందరిని కోవర్టులుగా కాంగ్రెస్‌లోకి పంపి చిచ్చు పెట్టేలా కుట్రలు పన్నుతోందని దుయ్యబట్టారు. వాస్తవాలు తెలుసుకోకుండా మంత్రి హరీశ్‌రావు తనపై, రేవంత్‌రెడ్డిపై బహిరంగ సభలో చులకనగా మాట్లాడటం సరికాదన్నారు. భాగ్యలక్ష్మి టెంపుల్ కాదు.. శివగంగకు రావాలని కొత్తమనోహర్‌రెడ్డికి సవాల్ చేశారు. సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సవాల్‌కు సిద్ధం..

- ఉదయం 5 గంటలకే శివగంగకు వస్తా
- కాంగ్రెస్ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న కొత్త మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: మహేశ్వరం శివగంగ ఆలయానికి రావాలని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని కాంగ్రెస్ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు రావాలని సవాల్ విసారారని.. దీనికి తాను సిద్ధంగా ఉన్నానని.. ఉదయం 5 గంటలకే వస్తానని ప్రతి సవాల్ చేశారు. తనను బీఆర్‌ఎస్ పార్టీ కోవర్టు అంటున్న వారు ఏ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారో ఆలోచించుకోవాలని హితవు పలికారు. మహేశ్వరం టికెట్‌కు సంబంధించి వస్తున్న ఆరోపణలపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మేయర్ చిగురింత పారిజాత దంపతులు ఆలయానికి వచ్చి నిజాయితీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. రూ.10 కోట్లు, ఐదెకరాల భూమి తీసుకున్నట్లు రేవంత్‌రెడ్డిపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో భాగ్యలక్ష్మి అమ్మవారిపై ప్రమాణం చేసి నిజాయితీ నిరూపించుకోవాలని తాను సవాలు చేసి 24 గంటలైనా రేవంత్ రెడ్డి స్పందించలేదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి మీరే కోవర్టుగా వ్యవహరిస్తున్నారని, ముందు మేయర్ పదవికి రాజీనామా చేసి తరువాత నిజాయితీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, భక్తి మార్గంలో నడవాలని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సూచించారు. శనివారం అన్మాస్‌పల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో బిక్కునాయక్, హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి పల పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమా న్ చాలీసా పారాయణం, సత్యనారాయణ స్వామి వ్రతం, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ చేయగా.. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గిరిజన విద్యార్థినికి సన్మానం..

పోచమ్మగడ్డతండాకు చెందిన బీక్యానాయక్–చిత్ర దంపతుల కుమార్తె రాఘవి నీట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించి, మెడికల్ కళాశాలలో సీటు పొందింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాఘవిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, వీరయ్య, మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, శ్రీనునాయక్, లక్ష్మయ్య ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శ్రీనునాయక్(ఫైల్)

కడ్తాల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన సబావత్ శ్రీను నాయక్(25) గత నెల 28న స్నేహితులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొట్టింది. శ్రీనునాయక్‌కు తీవ్రగాయాలు కాగా.. భరత్, ఉదయ్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. శ్రీనునాయక్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపారు.

రెచ్చిపోయిన దొంగలు

12.5 తులాల బంగారం,

18 తులాల వెండి అపహరణ

షాద్‌నగర్‌రూరల్: గణేశ్ నిమజ్జన ఉత్సవాల్లో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తుండగా.. దొంగలు ఇళ్లల్లో చోరీలకు తెగబడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు రెచ్చిపోయారు. శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన శారద తమ బంధువులు చనిపోవడంతో ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. తాళం పగులగొట్టి 10తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. అదే కాలనీలో మరో ఇంట్లోకి చొరబడి చిల్లర డబ్బులను ఎత్తుకెళ్లారు. అలాగే, సిండికేట్ కాలనీలో నివాసం ఉంటున్న సుమన్ ఇంట్లో రెండున్నర తులాల బంగారం, మూడు తులాల వెండిని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ రఘువీర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ ఏవీనగర్–2లో గుర్రంపల్లివెంకటయ్య ఆర్టీసీ డ్రైవర్ కుటుంబం నివాసం ఉంటుంది. తన భార్యను అనారోగ్యంతో గత నెల 19న తార్నాకలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చేర్పించారు. 28న సాయంత్రం వెంకటయ్య ఉద్యోగానికి వెళ్లగా.. కుమార్తె ఇంటికి తాళం వేసుకొని స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువా తాళం పగలగొట్టి 4 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోర్సుల ఎంపికలో ప్రణాళిక తప్పనిసరి

మొయినాబాద్: విద్యార్థులు భవిష్యత్ ప్రణాళిక, అవకాశాలపై అవగాహనతో ఎంబీఏ కోర్సులు ఎంపిక చేసుకోవాలని పీడీఐఎంటీఆర్ నాగ్‌పూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ముకుల్ భర్గాటే అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాల విద్యార్థులకు శనివారం భవిష్యత్ ప్రణాళిక, ఎంబీఏ కోర్సులు ప్రాముఖ్యత, విభాగాల ఎంపిక ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ముందున్న అవకాశాలను బట్టి కోర్సుల ఎంపికలో లోతైన అధ్యయనం చేయాలన్నారు. వ్యాపార, ఉద్యోగ అవకాశాల డిమాండ్ ఆధారంగా కోర్సులు ఎంపిక చేకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల పాలిట శాపం డ్రగ్స్

- మత్తు ఉచ్చులో చిక్కితే జీవితం అంధకారం
- సివిల్ జడ్జి శ్రీదేవి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ఇబ్రహీంపట్నం: డ్రగ్స్ ఉచ్చులో చిక్కితే జీవితం అంధకారంం అవుతుందని ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. స్థానిక గురునానక్ విద్యాసంస్థలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ నిర్మూలన అనే అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాల్సిన విద్యార్థులు.. చేడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. డ్రగ్స్ వారి పాలిట శాపంగా మారిందన్నారు. తెలిసో తెలియకో చేసిన తప్పు తప్పే అవుతుందన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన చట్టాల్లోని శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. ఇలాంటి కేసుల్లో విద్యార్థులు ఇరుక్కుంటే జైలు గోడల మధ్య జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు మాట్లాడారు. నేడు సమాజంలో మహిళలు, చిన్నపిల్లలపై లైంగిక వేధింపులు పెరగడం బాధాకరమన్నారు. జీవితంలో ఎదిగేందుకు విద్యార్థి దశ నుంచే గొప్ప ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది సీహెచ్ రవి, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్‌రెడ్డి, డైరెక్టర్ వెంకట్రావ్, జేడీ పార్థసారథి పాల్గొన్నారు.

రైతులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చేవెళ్ల: దేశానికి అన్నం పెట్టే రైతులకు వచ్చే నష్టాలు, కష్టాలను ఎదుర్కొనేందుకు న్యాయపరమైన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని చేవెళ్ల సీనియర్ సివిల్‌కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. మండలంలోని పలుగుట్టలో శనివారం సర్పంచ్ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు రైతులకు న్యాయపరమైన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యవసాయాన్నే నమ్ముకొని జీవించే రైతులు కొన్ని ఇబ్బందులతో నష్టపోవాల్సిన పరిస్థితులు ఉంటాయని చెప్పారు. కల్తీవిత్తనాలు, కల్తీ మందులతో నష్టపోతుంటారని తెలిపారు. రైతులు నష్టపోయిన వాటికి బాధ్యత ఇతరులది అయినప్పుడు వాటిపై నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. విత్తనాలు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద విక్రయించి, వాటికి రసీదు పొందాలని సూచించారు. దీంతో నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే, ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన వారికి ప్రభుత్వం పరిహారం అందిస్తుందని చెప్పారు. ప్రతి రైతు చిన్నచిన్న విషయాలపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో వచ్చే నష్టాల నుంచి కొంతైనా లాభం పొందే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, లీగల్ కౌన్సిల్ కుమార్, న్యాయవాదులు గీత వనజాక్షి, రవీందర్, వెంకటేశ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.